నవతెలంగాణ
నమ్మగ్గ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

కూలింగ్ వాటర్ క్యాన్ల పంపిణీ

నవతెలంగాణ-దహెగాం



మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉపాధి హామీ కూలీల కోసం తెచ్చిన కూలింగ్ వాటర్ క్యాన్లను వివిధ గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లకు బుధవారం అందజేసినట్లు ఎంపీడీఓ రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని కూలీలకు తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో అన్ని గ్రామాలకు క్యాన్లను అందిచడం జరిగిందన్నారు. వీటిని కేవలం కూలీల కోసం మాత్రమే వినియోగించుకోవాలన్నారు. సుమారు 500 నీటి క్యాన్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ప్రణీత్‌బాబు, పంచాయతీరాజ్ ఏఈ ఆత్మారామ్, ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి తొట్టెల ఏర్పాటు అభినందనీయం



ఆదిలాబాద్‌టౌన్ : ఎండాకాలంలో మూగ జీవాలు దాహం కోసం ఇబ్బందులు పడకుండా నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫర్ సొసైటి అధ్యక్షుడు అజీజ్ తన పుట్టిన రోజు సందర్భంగా మూగ జీవాల కోసం నీటి తొట్టెలను ఏర్పాటు చేశారు. పట్టణంలోని మసూద్ చౌక్‌లో ఈ నీటి తొట్టెలు ఏర్పాటు చేయగా కంది శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అథితిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ దాతలు కూడా ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పుట్టిన రోజున మంచి కార్యక్రమం చేపట్టడం పట్ల అజీజ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సాబీర్ హుస్సెన్, ముజహీద్, రవీందర అగర్వాల్, మొయిస్, చిన్నయ్య సురేష్, కాంగ్రెస్ నాయకులు ఖయ్యుం, అతీకొద్దీన్ పాల్గొన్నారు.

భానుడి ప్రతాపం..ప్రచారానికి ఆటంకం..!

- ఉమ్మడి జిల్లాలో 43.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- ఎండవేడిమికి అభ్యర్థులు.. కార్యకర్తల ఉక్కిరిబిక్కిరి
- మండల స్థాయికే పరిమితమైన ప్రచారపర్వం
- ముంచుకొస్తున్న పోలింగ్ సమయం..పార్టీల్లో టెన్షన్

ఒక పక్క భానుడి భగభగలు..మరోపక్క లోక్‌సభ ఎన్నికల ప్రచారం..ఉమ్మడి జిల్లా రాజకీయాలను మరింత హీటెక్కిస్తోంది. ప్రస్తుతం ఎండలు మండిపోవడంతో అభ్యర్థులు.. ఆయా పార్టీల్లో టెన్షన్ వాతావరణం కనిపిస్తోంది. ఉదయం వేళలోనే కాలు బయటపెట్టలేని పరిస్థితి ఉండటంతో ప్రచార పర్వంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో 43.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడం..ఎండవేడిమి తట్టుకోలేక మనుషులు..పశుపక్ష్యాదులు అల్లాడిపోతుండటం సమస్యను తీవ్రతను తెలియజేస్తోంది. ఈ తరుణంలో పల్లెల్లో ప్రచారం చేసేందుకు అభ్యర్థులు వెనుకడుగు వేస్తున్నారు. ప్రచారంలో అభ్యర్థుల వెంట వెళ్లే కీలక నాయకులు, కార్యకర్తలు సైతం ఎండ తీవ్రత కారణంగా వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. పోలింగ్‌కు మరో నెల పది రోజుల పాటు సమయం ఉండటం.. ఎండల తీవ్రత రోజురోజుకు అధికం కావడం చూస్తుంటే గడువులోపు ఏడు నియోజకవర్గాలు చుట్టిరావడం అభ్యర్థులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ సమరం రసవత్తరంగా మారుతోంది. ఆయా ప్రధాన పార్టీలు ఇది వరకే అభ్యర్థులను ప్రకటించాయి. లోక్‌సభ సీటును దక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి ఆత్రం సుగుణ, బీఆర్ఎస్ నుంచి ఆత్రం సక్కు పోటీ చేయనుండగా.. బీజేపీ నుంచి గోడం నగేష్ బరిలో నిలువనున్నారు. ఈ మూడు పార్టీలు సైతం గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండటం ఆసక్తికరంగా మారుతోంది. ఈ క్రమంలో ఎండల తీవ్రత ఆయా పార్టీలను కలవరపాటుకు గురిచేస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడం పార్టీల ఆందోళనకు కారణమవుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడిమి..వడగాల్పుల కారణంగా బయటకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. ప్రస్తుతం ఆయా పార్టీల అభ్యర్థులు మండల కేంద్రాల్లో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తూ కుల సంఘాల పెద్దలను కలుస్తూ తమకు మద్దతునివ్వాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ లోక్‌సభ పరిధిలో ఏకంగా ఏడు నియోజకవర్గాలు ఉండటం వాటి పరిధిలో వందలాది గ్రామాలు ఉన్నాయి. ఈ నెలన్నర సమయంలో ఆయా గ్రామాలన్నింటిలో ప్రచారం నిర్వహించడం అభ్యర్థులకు కష్టతరంగా మారుతోంది. అభ్యర్థులతో పాటు వారి వెంట వెళ్తున్న కార్యకర్తలు, అనుచరులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

రాజకీయ పార్టీల్లో టెన్షన్..!

ఈ వేసవిలో ఎండల తీవ్రత ఏప్రిల్ మొదటి వారంలోనే 43డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడం అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరగనుందనే సమాచారంతో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, శ్రేణుల్లో మరింత భయాందోళన రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయం తక్కువగా ఉండటం..ఎండలు మండిపోవడంతో ఏడు నియోజకవర్గాల్లోని గ్రామాలన్నింటిలో ప్రచారం నిర్వహించడం సాధ్యమవుతుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రానున్న రోజుల్లో ప్రచారం నిమిత్తం ఆయా పార్టీల ముఖ్య నాయకుల సభల నిర్వహణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో ఎండల తీవ్రత దృష్ట్యా ఈ సభలకు జనాన్ని తరలించడం కూడా ఆయా పార్టీల అభ్యర్థులకు సవాల్‌గా మారనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రానున్న పక్షం రోజుల తర్వాత లోక్‌సభ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకోనుండగా.. అదే స్థాయిలో ఎండల తీవ్రత కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా భావిస్తున్న రాజకీయ పార్టీలకు తాజా ఎండల తీవ్రత ప్రచారంపై ప్రభావం చూపిస్తుందని ఆయా పార్టీల నాయకులు చెబుతున్నారు.

పెరగనున్న ఉష్ణోగ్రతలు..!

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడం.. ప్రతి ఏటా మే నెలలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ప్రభావం చూపించడం కారణంగా జనం సైతం తట్టుకోలేకపోతున్నారు. మనుషులే కాకుండా పశు పక్ష్యాదులు సైతం అల్లాడిపోతున్నాయి. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు ఇంటి నుంచి కాలు బయటపెట్టలేకపోతున్నారు. ఎక్కువ మంది సాయంత్రం వేళలోనే బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతుండటంతో వీటి బారిన పడకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవడమే ఉత్తమమైన మార్గమని అనేక మంది భావిస్తున్నారు.



జిల్లా కేంద్రంలో రోడ్లపై జన సంచారం తక్కువగా ఉన్న దృశ్యం



ప్రచారం నిర్వహిస్తున్న ఆత్రం సుగుణ

అంబేద్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-లక్షెట్టిపేట

ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షులు తొగరు రాజు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్, జ్యోతిబాపూలే తదితర నాయకుల జయంతులు, వర్ధంతులను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లంపల్లి రమేష్, గుత్తికొండ శ్రీధర్, చుంచు రమేష్, పెండెం సత్తయ్య, లింగంపల్లి సుధాకర్, పెండెం రాజశేఖర్, మామిడి సందీప్, సామనపల్లి దుర్గాంజనేయ, చాతరాజు రాజేష్, బొలిశెట్టి సందీప్, జక్కుల రాజలింగు, కూశనపల్లి భానుకుమార్, మంచాల కుమార్, పులి సునీల్, రాజేష్ పాల్గొన్నారు.

టెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగోన్నతులు కల్పించాలి



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు సునీల్ చౌహన్ అన్నారు. బుధవారం మండల కార్యవర్గ సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెట్ విషయంలో ఉపాధ్యాయులందరూ తీవ్ర గందరగోళంలో ఉన్నారని, ప్రభుత్వం వెంటనే దీనిపై స్పష్టత ఇవ్వాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సిర్పూర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ మనోజ్ కుమార్, కోశాధికారిగా ఉయిక గంగాధర్, మీడియా కన్వీనర్‌గా రాథోడ్ జ్ఞానేశ్వర్, రాథోడ్ అశ్విన్, కార్యదర్శిగా చవాన్ సంతోష్, కోవ గంగారాం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ, జిల్లా నాయకులు మేస్రం రాజ్‌కుమార్, బత్తుల గంగాధర్ పాల్గొన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న బీజేపీ ఎంపీ అభ్యర్థి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండలం పోలంపల్లిలో మృతి చెందిన తాజా మాజీ సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దర్శనాల రమేష్ తండ్రి అంతిమ యాత్రలో బిజెపి పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ పాల్గొన్నారు. బుధవారం రమేష్ తండ్రి మృతి చెందినట్లు అందిన సమాచారం మేరకు ఆయన పోలంపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గోమాసే శ్రీనివాస్‌తో పాటు బిజెపి నాయకులు దుర్గం ఎల్లయ్య, నేతకాని మహా కుల హక్కుల పరిరక్షణ సంఘం జిల్లా అధ్యక్షులు పొట్టల నాగరాజు ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి రైల్వే స్టేషన్ వద్ద గాయాలతో ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు రైల్వే ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మంగళవారం రైల్వేస్టేషన్లో గాయాలతో ఉండగా స్థానికుల సమాచారంతో 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వివరాలు తెలియలేదన్నారు.

మౌలిక సదుపాయాల అంచనాలు త్వరగా పూర్తి చేయాలి

- నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాల అంచనాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ నెల 4, 5 తేదీల్లో పాఠశాలల్లోని 5 రకాల పనులకు సంబంధించి వాటి పనుల అంచనాలను సంబంధిత ఇంజనీర్స్, హెడ్ మాస్టర్, విఓల సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. 6న మండల స్థాయిలో వర్క్‌షాప్ నిర్వహించి ఆ నివేదికను అందజేయాలని ఆదేశించారు. అంచనాల నివేదిక డీఆర్డీఓ ద్వారా పంపాలని, పాఠశాలల వారీగా వివరాలు సేకరించి అంచనాలను తయారు చేసి నివేదిక అందజేయాలని పేర్కొన్నారు. చిన్న చిన్న విద్యుత్, తాగునీరుకు సంబంధించి అడ్వాన్సుగా ఏఏపీసీ (అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మెన్)ద్వారా తీర్మానాలు పంపితే అడ్వాన్స్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పనులన్నీ జూన్ 10లోగా పూర్తి చేయాలని అన్నారు.


నీటి సమస్య లేకుండా సమ్మర్ ప్లాన్ తయారు చేయాలి



తాగునీటి ఎద్దడి కొరకు సమ్మర్ ప్లాన్ తయారు చేయాలని, దీనికి సంబంధించి ప్రత్యేక అధికారిగా ఐటిడిఏ పిఓ ఖుష్బూ గుప్తాను నియమించడం జరిగిందని తెలిపారు. మండలం, మున్సిపాలిటీలో ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, గ్రామపంచాయతీ అధికారులు వారికి సంబంధించిన గ్రామాలను తేదీల వారీగా ఒక్కొక్క గ్రామానికి వెళ్లి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అన్నారు. వారికి కేటాయించిన గ్రామాలను తప్పనిసరిగా వారానికి మూడుసార్లు పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాలలో ఎవరైన సంబంధిత అధికారులు పనిచేయడం లేదని తన దృష్టికి వస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. సమస్యలు ఉన్న హ్యాబిటేషన్‌లో వాటర్‌కు సంబంధించి మిషన్ భగీరథ వాటర్, బోర్‌వెల్, చేతి పంపు తదితర వాటి అంచనాలను తయారు చేసి నివేదిక అందజేయాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని, మోటారు ద్వారా నీటిని సరఫరా చేయాలని, ఏవైన మంజూరుకు సంబంధించి అంచనాలు తయారు చేసి పంపాలన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎవరు కూడా బావి దగ్గరకు వెళ్లి నీరు తీసుకోకూడదని, ట్యాంకర్ల ద్వారా ఇంటింటికి నీరు సరఫరా చేయాలని దిశా నిర్దేశం చేశారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా చేపట్టాలని నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు, పిఎసీఎస్, డిసిఎంఎస్, ఐకేపి సంఘాలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటించి వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. జిల్లాలో రేపటి నుండి 125 కేంద్రాలలో కొనుగోళ్లను ప్రారంభించాలని, తేమ శాతం 17 లోపు ఉండాలని ఆదేశించారు. వేసవికాలం నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాలలో తాగునీరు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు ప్రతిరైతు ఆధార్, బ్యాంకు, పట్టా పాస్‌బుక్ తీసుకురావాలని అన్నారు. కేంద్రాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని, ఎలాంటి ఇబ్బందులు రాకుండా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్డీవో విజయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు శ్రీకళ, నందిత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, అధికారులు, మహిళాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పాల్గొన్న అధికారులు

ఉపాధి కూలీలకు పని కల్పించాలి : డీఆర్‌డీఓ



నవతెలంగాణ-తలమడుగు

మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు అందించి ఉపాధి హామీ పనులను కల్పించాలని డిఆర్‌డిఓ సాయన్న అన్నారు. బుధవారం మండల ఉపాధి హామీ సిబ్బందితో రైతు వేదిక భవనంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డుతో పాటు పనులు కల్పించాలని అధికారులను కోరారు. పనుల్లో జిల్లాలోనే మండలం వెనుకబడి ఉందని ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలీలకు పని కల్పించని సిబ్బంది, పనిచేయని వారు వెళ్లిపోవచ్చని మండిపడ్డారు. జాబ్‌కార్డు ఉన్న వారికి పనులు కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా మంచినీటి సమస్యపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ శేఖర్, ఏపీవో మేఘమాల, టెక్నికల్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులకు, పిల్లల పెళ్లిళ్ల గల ఉపాధ్యాయులకు 10వ తరగతి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఎస్.శ్రీకాంత్, ఎం.జలంధర్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా విద్యాశాఖధికారిణి ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఏ-2 పరీక్షల నిర్వహణకు ఆటంకం కలగకుండా, సబ్జెక్టు బోధించని ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. దీనిపై విద్యాశాఖధికారి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు అసిస్టెంట్ ఎగ్జామినర్, స్పెషల్ అసిస్టెంట్ విధుల కొరకు మూల్యాంకన కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

మానవత్వం చాటుకున్న మాజీ సర్పంచ్ హరినాయక్

నవతెలంగాణ-ఉట్నూర్



దొరికిన మొబైల్‌తో పాటు నగదును యజమాని భోస్లే మాధవ్‌రావుకు మాజీ ఉపసర్పంచ్ జాదవ్ హరినాయక్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. మండలంలోని లింగోజి తండా గ్రామపంచాయతీలోని ఎక్స్ రోడ్డు గ్రామంలో శుక్రవారం రోజు లభ్యమైన మొబైల్‌తో పాటు నగదును భోస్లే మాధవ్‌రావుకు బుధవారం అందించాడు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జాదవ్ హరినాయక్ మాట్లాడుతూ ఏ వస్తువైనా ఎవరికి దొరికిన తిరిగి వారికి అందె విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. పోగొట్టుకున్న వస్తువుతో మనం ఎంత బాధ పడుతామో మనకు తెలుసునని గుర్తు చేశారు. మొబైల్‌ను అందజేసిన వారిలో జాదవ్ శరత్ నాయక్, గబ్బర్ సింగ్, శివాజీ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండల కాంగ్రెస్ నాయకుడు రాథోడ్ గణేష్ ఆనారోగ్యంతో ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ బుధవారం లాల్‌టెక్డిలోని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అతని కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు నాగోరావ్, ముఖాడే ఉత్తం ఉన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ మాణిక్‌రావు కుమార్తె వివాహానికి బుధవారం తన వంతు రూ.2వేల 500 ఆర్థిక సాయాన్ని అందించారు. గరీబ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు బానోత్ జగన్ నాయక్ అడ్వొకేట్ మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో నా వంతుగా వివాహానికి, విద్యకోసం, అంత్యక్రియలకు, ఆస్పత్రిలో అత్యవసరాల నిమిత్తం, ప్రజలకు సేవ చేసేందుకు ముందుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ అజయ్, రాథోడ్ దేవుసింగ్, జాదవ్ మనోహర్, గట్ల శంకర్, దుర్గం ముత్యాలు ఉన్నారు.

చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తాంసి

వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం చాలా మంచిదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం పొన్నారి గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం మంచిదని అన్నారు. అలాగే మూగజీవాలకు సైతం నీటి కుండీలను అక్కడక్కడ ఏర్పాటు చేసి మూగజీవాల దాహార్తి తీర్చాలని అన్నారు. ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతున్నాయని ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకొని అత్యవసర సమయాల్లో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ రేఖ రఘు, పంచాయతీ కార్యదర్శి విజయ్, వివిధ మండలాల నాయకులు తుల శ్రీనివాస్, రమణ, లక్ష్మీపతి, నాగయ్య ఉన్నారు.

శనగలను మార్కెట్ యార్డులోనే విక్రయించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

రైతులు పండించిన శనగలను మార్కెట్ యార్డులో విక్రయించాలని ప్యాక్స్ సీఈఓ మల్లయ్య అన్నారు. బుధవారం మండలంలోని హస్నాపూర్ గ్రామంలోని సబ్ మార్కెట్ యార్డులో శనగలు కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రైతులు పండించిన శనగలకు మార్కెట్ మద్దతు ధర రూ. 5,440లకు విక్రయించాలని అన్నారు. ప్రయివేటు దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. అమ్మడానికి వచ్చే రైతులు తమ వెంట పంటతో పాటు పట్టా పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలు తీసుకోని రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అంగన్‌వాడీలో అవగాహన



నవతెలంగాణ-తాంసి

వేసవి కాలం నేపథ్యంలో వడదెబ్బకు ప్రజలు గురికాకుండా ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా బుధవారం మండలంలోని పొన్నారి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు గడుగు దేవమ్మ, సూరం గంగమ్మతో పాటు పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన గర్భిణులకు, చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించారు. వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అన్నారు. ఎండలు ముదురుతున్నందున మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఎవరూ కూడ అత్యవసరమైతేనే తప్ప బయటకు వెళ్ల వద్దన్నారు. వెళ్లేటపుడు మంచినీళ్ల వెంట తీసుకెళ్లాలని, గొడుగు, తలకు క్యాప్ ధరించాలని అన్నారు. వడదెబ్బకు గురైనట్టు అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

నేడు శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్నట్టు సీఈఓ ధరమ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. క్వింటాల్‌కు ప్రభుత్వ మద్దతు ధర రూ.5,440 ప్రకారం కొనుగోలు చేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఆన్‌లైన్‌లో పంట వివరాలు నమోదు చేసిన వారు, తమ వెంట పట్టా పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను తమ వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

- విధుల్లో నుంచి తొలగించిన వారిని చేర్చుకోవాలి
- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్
- రిమ్స్‌లో సీఐటీయూ ఆందోళన



సీఐటీయూ ఆధ్వర్యంలో రిమ్స్ ఐపీ బ్లాక్ ముందు దర్నా చేస్తున్న రిమ్స్ కార్మికులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన పని చేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులకు జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. చిన్న చిన్న కారణాలు చూపుతూ ఎండ్లుగా పని చేస్తున్న వారిని తొలగించడాన్ని నిరసిస్తూ బుధవారం ఆందోళన చేపట్టారు. రిమ్స్‌లోని ఐపీ బ్లాక్ ఎదుట విధులు బహిష్కరించి, గంట పాటు సీఐటీయూ అనుబంధ తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ రిమ్స్‌లో కృష్ణ ఏజెన్సీ నిర్వాహకులు కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. జీఓ నెం.60 ప్రకారం రూ.15 వేల 600 ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఈపీఎఫ్‌లో దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై రిమ్స్ అధికారులకు విన్నవించిన ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. అదే విధంగా చిన్న చిన్న కారణాలతో తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లో నుంచి తొలగించే ముందు వారికీ ఎలాంటి ముందుస్తు నోటీసులు ఇవ్వలేదన్నారు. కార్మిక చట్టాలను పాటించలేదన్నారు. వారు గత 12 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్నారని ఉద్యోగం నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. సీనియార్టీ ప్రకారం పేషేంట్ కేర్‌లు ఇవ్వాలని, స్వీపర్లను తగినంత మందిని నియమించాలని అన్నారు. అకారణంగా తొలగించ బడిన కార్మికులు ఆర్.సురేందర్, డి.రాకేష్, జి.మల్లేష్, జి.రజిత, కే.రజిత, సుల్తానబిలను వెంటనే పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఐదు రోజుల పాటు గంట సేపు నిరసన తెలుపుతామని, సమస్య పరిష్కరం కానీ పక్షంలో సమ్మెచేపడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, తెలంగాణ యూనైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నవీన్, రిమ్స్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిదాస్, అక్రమ్, పొచన్న, సుమతాయి, రమేష్, అరుణ్, ఖలీల్, సరోజ, సుశీల పాల్గొన్నారు.

మొదటి దశ ఈవీఎం, వీవీప్యాట్‌ల ర్యాండమైజేషన్ పూర్తి



రాజకీయ ప్రతినిధులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-ఆదిలాబాద్

మొదటి దశ ఈవీఎం, వీవీప్యాట్‌ల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని తెలిపారు. జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజకవర్గాల పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరిగిందన్నారు. నిర్మల్ నియోజకవర్గం పరిధిలో 382 కంట్రోల్ యూనిట్లు, 382 బ్యాలెట్ యూనిట్లు, 413 వీవీ ప్యాట్‌లు కేటాయించగా, ఖానాపూర్ నియోజకవర్గానికి 385 కంట్రోల్ యూనిట్‌లు, 385 బ్యాలెట్ యూనిట్లు, 415 వీవీ ప్యాట్ లను, ఆలాగే ముథోల్ నియోజకవర్గంలో కంట్రోల్ యూనిట్లు 388, బ్యాలెట్ యూనిట్లు 388, 419 వీవీ ప్యాట్‌లను ఆన్‌లైన్ విధానం ద్వారా ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు. మొదటి దశ ర్యాండమైజేషన్‌కు సంబంధించిన రిపోర్టు కాపీలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరుగుతుందని అన్నారు. రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఎన్నికల కమిషన్ నిబంధనలను తప్పనిసరి పాటించాలని అన్నారు. ప్రచారానికి, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సువిధ యాప్ ద్వారా అనుమతులు పొందాలని తెలిపారు. నిబంధనలను పాటిస్తూ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఈడీఎం నదీమ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- ఎంపీ అభ్యర్థి సుగుణ



కార్యకర్తలతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

నవతెలంగాణ-నార్నూర్

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తనను ఎంపీగా గెలిపిస్తే మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని భరోసా కల్పించారు. గత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఓ నెంబర్ 3ను తొలగించి, గిరిజన ఆదివాసులకు అన్యాయం చేసిందన్నారు. కేవలం కాంగ్రెస్ హయాంలో ఆదివాసీ గిరిజనులకు ట్రైబల్ బెటాలియన్, ఏజెన్సీ డీఎస్సీ, ఎస్సీ ఎస్టీ, బీసీ సబ్ ప్లాన్ నిధులు, గిరిజనులకు పోడు పట్టాలు, అందరికీ ఈజీఎస్ ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి అభివృద్ధి చేసిందన్నారు. ఈసారి ప్రజలు ఆలోచించి, ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. అదే విధంగా దేశంలో రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడానికి కృషి చేద్దామని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే మనకు ఎటువంటి లాభం జరగదని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు మునిర్, భారత్ వాగ్మారే, మండల నాయకులు దేవ్‌రావ్ లోఖండే, బ్రిజులాల్, జాకీరుల్లాఖాన్, దిగాంబర్, విలాస్ జాదవ్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలి

నవతెలంగాణ-తలమడుగు

ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని సాయిలింగిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు భక్తి మార్గాన్ని అలవర్చుకొని శాంతి మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు తోట వెంకటేష్, కిరణ్ కుమార్, పొచ్చన్న, జనార్ధన్, లాల్‌గడ్ దాస్, నరేందర్, రామ్‌కిషన్, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బుద్ధ జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బుద్ధ జయంతిని విజయవంతం చేయాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి దయానంద్ అన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుద్ధ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. బుద్ధ జయంతికి సంబంధించిన గోడప్రతులను ఆవిష్కరించారు. బుద్ధ జయంతి సందర్భంగా మహిళా శ్రామ్నేర్ శిబిరాలను ఈ నెల 21 వరకు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈ శిబిరాలకు బౌద్ధ ఉపాసకులు, ఉపాసికలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కైలాస్ నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌లో ఈ శిబిరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్టు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు బెల్లూరి అయ్యప్ప ఆలయం వద్ద తనిఖీలు నిర్వహించాం. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ నజీర్ తన ఆటోలో రేషన్ బియ్యాన్ని మహారాష్ట్ర తరలిస్తుండగా పట్టుకున్నాం. ఐదు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం కేస్ వర్కర్ నాగమణి అన్నారు. బుధవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పొచ్చెరలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖీ కేంద్రం అందించే ఐదు రకాల సేవలు కౌన్సెలింగ్ సేవలు, న్యాయ సహాయం, పోలీస్ సహాయం, వైద్య సేవలు, తాత్కాలిక వసతి గురించి తెలియజేశారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యకంగా మహిళలు, బాలికల చట్టాలు, గృహ హింస చట్టం, బాల్యవివాహాల చట్టం, పోక్సో చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాల గురించి, సఖి కేంద్రంలో వచ్చిన బాధితుల వివరాలను గోప్యంగా ఉంచబడతాయని అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన హెల్ప్ లైన్ నెంబర్లు 181, 100, 1098, 1930, ఈ కాలంలో జరుగుతున్న హింసలు, లింగ సమానత్వం, విద్య ప్రాముఖ్యతపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ లచ్చారెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువును పొడిగించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిగ్రీ కళాశాల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షా ఫీజు గడువును పొడిగించాలని, పెంచిన డిగ్రీ విద్యార్థుల పరీక్ష ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలలకు సంబంధించిన సెమిస్టర్ ఫీజుల చెల్లింపు గడువును పొడిగించాలన్నారు. ఇప్పటికే విద్యార్థులు అన్ని విధాలుగా ఆర్థికంగా నష్టపోయారని, ఇప్పుడు పరీక్ష ఫీజులను సైతం పెంపుదల చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే సెమిస్టర్ ఫీజులను అధికంగా యూనివర్సిటీ పెంచిందని, ఒక్కో పేపర్‌కు రూ.200 అధికంగా పెంచారని, వన్ టైం పరీక్షకు ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరిగే సెమిస్టర్‌కు ఫీజులను పెంచడం ద్వారా విద్యార్థులపై తీవ్ర ఆర్థిక భారం పడుతుందని వాపోయారు. తక్షణమే యూనివర్సిటీ అధికార యంత్రాంగం స్పందించి ఫీజుల గడువును పెంచాలని, పెంచిన పరీక్ష ఫీజులను తగ్గించాలని, ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఫీజులు చెల్లించేలా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మెస్రం హరీష్, కుంర భీమ్‌రావు పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమాస్తాల సంఘం కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

న్యాయవాదుల గుమస్తాల సంఘం కార్యవర్గాన్ని బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఊడుగు భూమన్న, ప్రధాన కార్యదర్శిగా రూపేష్, ఉపాధ్యక్షుడిగా మారుతి, కోశాధికారిగా సురేందర్, సంయుక్త కార్యదర్శిగా విశ్వ ప్రదీప్, క్రీడల కార్యదర్శిగా ఆకాష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు నగేష్ కార్యవర్గ సభ్యులు శాలువాలతో సత్కరించారు.

అడ్మిషన్ల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరానికి అడ్మిషన్ కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9849390495 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. తమ కళాశాలలో ఎంఎస్సీ డేటా సైన్స్ ఒక పోస్టు ఖాళీ ఉందన్నారు. ఎంసీఏ మొదటి శ్రేణిలో నెట్ సెట్, పీహెచ్‌డీ అర్హత అనుభవం కలిగిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థుల ఈ నెల 9న కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భార్యని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు వెలువరించారు. కాగజ్‌నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ ఆఫీసర్ బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. 2023 సంవత్సరంలో పెంచికల్‌పేట్ మండలంలోని మురళిగూడ గ్రామానికి చెందిన కమెర శ్రీనివాస్ తన భార్య కమెర లక్ష్మి(43)ని హత్య చేసిన నేరంపై కేసు నమోదుచేసి విచారణ చేపట్టారు. హత్య నేరం రుజువు కావడంతో నేరస్తుడు కమెరా శ్రీనివాస్‌కు సెక్షన్ 302 ఐపిసి ప్రకారం జీవిత కాలం జైలుతో పాటు రూ.2 వేల జరిమానా, కమెర శ్రీనివాస్‌కు చెందిన ఆస్తిని పిల్లల పేరు మీద జమ చేయవలసిందిగా సంబంధిత తహసల్దార్‌కు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ కే.సురేష్ కుమార్ అభినందించారు.

ఈజ్‌గాంలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్




పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అధ్వర్యంలో సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఫ్లాగ్ మార్చ్‌ను డీఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలందరూ సహకరించాలన్నారు. ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అల్లర్లు జరగకుండా ప్రజలంతా సహకరించాలని, ఎలక్షన్ కమిషన్ సూచించిన మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ఇప్పట్నుండే ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఎవరైన చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు, ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్, పోలీసులు పాల్గొన్నారు.


గురువర్యా... నీకిది తగదయ్యా....

- డిప్యూటేషన్‌పై వెళ్తున్నానని చెప్పి విధులకు ఎగనామం
- మాయమైన పాఠశాల హాజరు రిజిష్టర్లు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

పిల్లలకు విద్యాబుద్దులతో పాటు మంచి నడవడిక నేర్పాల్సిన ఒక ఉపాధ్యాయుడు తానే నడవడిక తప్పి ప్రభుత్వ విధులనే విస్మరించాడు. డిప్యుటేషన్ ఆర్డర్ లేకున్నా డిప్యుటేషన్‌పై వెళ్తున్నట్లు తానే పాఠశాల రిజిష్టర్‌లో రాసుకొని విధులకు ఎగనామం పెట్టాడు. అంతే కాకుండా పాఠశాల హాజరు రిజిష్టర్‌లో 'ఆన్‌డ్యూటీ' అని రాసుకొని కూడా విధులకు ఎగనామం పెట్టేశాడు. దీనిపై ఉపాధ్యాయ సంఘం నాయకులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు దీనిపై విచారణ చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



డిప్యూటేషన్‌పై సలుగుపెల్లి పాఠశాలకు ఎవరూ రాలేదని ఉపాధ్యాయుడు రాతపూర్వకంగా ఇచ్చిన సమాధానం



2019 మార్చి నెలలో సలుగుపెల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు రిజిష్టర్‌లో రాసుకున్న ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

చింతలమానెపల్లి మండలం ఖర్జవెల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా ఎండి మోసీన్ విధులు నిర్వర్తిస్తున్నాడు. 2008 డీఎస్సీలో రిక్రూట్ అయిన ఇతను 2015లో ఈ పాఠశాలకు బదిలీపై వచ్చాడు. 2019 జనవరి నుండి ఇతను బెజ్జూరు మండలం సలుగుపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు పాఠశాల హాజరు రిజిష్టర్‌లో రాసి ఉంది. 2019 జనవరి నుండి మార్చి వరకు హాజరు రిజిష్టర్‌లో డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు స్పష్టంగా పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలలో వేసవి సెలవులు కాగా జూన్ నుండి మళ్లీ ఖర్జవెల్లి గ్రామ పాఠశాలలో విధులకు హాజరైనట్లు సంతకాలున్నాయి. జూన్ నుండి అక్టోబర్ వరకు విధులకు సక్రమంగా హాజరైనట్లు ఆధారాలున్నాయి. డిసెంబర్ నెలలో సుమారు పది రోజులు ఆన్‌డ్యూటీ అని పేర్కొని విధులకు హాజరు కాలేదు. 2020 జనవరి నెలలో 15కు పైగా ఫిబ్రవరి నెలలో తొమ్మిది, మార్చి నెలలో ఐదు రోజులు ఆన్‌డ్యూటీ అని హాజరు రిజిష్టర్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఒక నెలలో రెండు, మూడు రోజులకు మించి ఓడిలు ఉండవని విద్యాశాఖాధికారులే చెపుతున్నారు.

హాజరు రిజిష్టర్లు మాయం

ఈ పాఠశాలకు చెందిన హాజరు రిజిష్టర్లు మాయమైనట్లు తెలుస్తోంది. 2017-18 విద్యాసంవత్సరానికి సంబంధించిన హాజరు రిజిష్టర్ అందుబాటులో లేదని తెలిసింది. దీనితో సదరు ఉపాధ్యాయుడు 2017 నుండే డిప్యుటేషన్ అని రాసుకొని విధులకు ఎగనామం పెట్టాడనే ఆరోపణలున్నాయి.

బయోమెట్రిక్ అమలులోకి వచ్చినా...

2019 జూన్ నుండి పాఠశాలలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టారు. ఈ విధానం వచ్చినా సదరు ఉపాధ్యాయుడు సక్రమంగా విధులకు హాజరు కానట్లు తెలుస్తోంది. సమాచర హక్కు చట్టం ద్వారా బయోమెట్రిక్ వివరాలు తీసుకోగా నెలల తరబడి అతను విధులకు హాజరు కానట్లే ఉంది. కాని హాజరు రిజిష్టర్‌లో మాత్రం సంతకాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ప్రేక్షకపాత్ర వహించిన రెండు మండలాల ఎంఈఓలు

కాగా ఈ వ్యవహారంలో ఇటు చింతలమానెపల్లి, అటు బెజ్జూరు మండలాల విద్యాధికారులు ఎందుకు ప్రేక్షకపాత్ర వహించారనేది ఇక్కడ ప్రశ్నార్థకంగా మిగిలింది. మండల విద్యాధికారికి తెలియకుండానే ఆ ఉపాధ్యాయుడు డిప్యుటేషన్‌పై ఎలా బెజ్జూరు మండలానికి వెళ్లాడు. అధికారుల ఆదేశాలు లేకుండా నెలల తరబడి అతను బెజ్జూరు మండలం సలుగుపెల్లి పాఠశాలలో ఎలా డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తించాడు. ఒక పాఠశాలకు ఉపాధ్యాయుడు నెలల తరబడి గైర్హాజరైనా సదరు మండల విద్యాధికారికి సమాచారం లేదా..? ఉంటే సదరు ఉపాధ్యాయునిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు. ఒక వేళ సమాచారం లేని పక్షంలో మండలంలోని ఉపాధ్యాయులపై ఎంఈఓ పర్యవేక్షణ లేదనే విషయంలో సందేహాలు రాక తప్పదు. బెజ్జూరు మండల ఇన్‌ఛార్జి ఎంఈఓ రమేష్‌బాబు 2019-20 విద్యాసంవత్సరంలో సలుగుపెల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు ప్రధానోపాధ్యాయునిగా కొనసాగుతున్నాడు. అదే పాఠశాలకు ఉపాధ్యాయుడు మోసీన్ డిప్యుటేషన్‌పై వెళ్తున్నట్లు హాజరు రిజిష్టర్‌లో పేర్కొన్నారు. ఇదే విషయంలో 2024 జనవరిలో సమాచర హక్కు చట్టం కింద సలుగుపెల్లి పాఠశాలకు 2017 నుండి 2020 వరకు డిప్యుటేషన్‌పై వచ్చిన ఉపాధ్యాయుల వివరాలు అడగగా ఈ పాఠశాలకు డిప్యుటేషన్‌పై ఎవరూ రాలేదని ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మినారాయణ సమాధానమివ్వడం ఇక్కడ గమనార్హం. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారిని వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

డిప్యూటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం లేదు

\- ఎంఈఓ సోమయ్య

'మెసిన్ డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు నాకు ఎలాంటి సమాచారం లేదు. పాఠశాలలో హాజరు రిజిష్టర్లు లేని విషయం కూడా నాకు తెలియదు. దీనిపై పాఠశాలకు వెళ్లి విచారణ జరుపుతాను.'

ఫిర్యాదు చేసినా స్పందన లేదు

\- ఇందూరావు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

'మోసిన్ వ్యవహారంపై 15 రోజుల క్రితం అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాను. తక్షణమే స్పందించిన ఆయన వెంటనే జిల్లా విద్యాశాఖాధికారిని విచారణకు ఆదేశించారు. కాని విద్యాశాఖాధికారి వద్ద ఇది పెండింగ్‌లో ఉంది. డీఈఓను ఇదే విషయమై ప్రశ్నిస్తే రేపు, మాపంటు కాలయాపన చేస్తున్నాడు'.

ఆదమరిస్తే అంతే సంగతులు

- నివాస గృహాలపై కరెంటు వైర్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రం అభివృద్ధి జరిగిన తర్వాత అనేక కాలనీలో రెండు మూడు అంతస్తుల భవనాలు నిర్మాణాలు జరుగుతున్న సందర్భంగా రహదారులు ఇరుకుగా ఉండడంతో కరెంటు వైర్లు భవనాల పక్కనుండి వెళ్లడంతో ఆదమరిస్తే ప్రాణాలు గాల్లో కలిసే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలోని బాపు నగర్‌లో జెడ్పీటీసీ నాగేశ్వరరావు ఇంటి ఎదురుగా నివాస గృహం పక్కనుండి 33/11కెవి వైర్లు వెళ్తున్నాయి. అధికారులు నివాస గృహాలకు దూరంగా వేయాల్సి ఉన్నప్పటికీ అదేది పట్టించుకోకుండా నివాస గృహనికి అనుకొని వెళ్లేలా వైర్లు అమర్చడంతో ఇంటి యజమానులు ఎప్పుడు ఏమి జరుగుతుందో అని ఆందోళనకు గురవుతున్నారు. ఇదే విషయం విద్యుత్ అధికారులను సంప్రదించగా రహదారి వెడల్పు లేకపోవడంతో కొంత ఇబ్బంది అవుతున్న మాట వాస్తవమేనని సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరించేలా చూస్తానని స్థానిక ఏఈ తెలిపారు.

సైబర్ బాధితులకు మెరుగైన సేవలు

- ఎస్పీ సురేష్ కుమార్
- సైబర్ వారియర్స్ ఏర్పాటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సైబర్ నేరాలతో ఇబ్బంది పడుతున్న బాధితుల కోసం మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. జిల్లాలో సైబర్ నేరాల అదుపు దేశంలో వారిగా ఏర్పాటు చేస్తున్న సైబర్ వారియర్స్‌కు ఫోన్లు, సిమ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ఒక్కో సైబర్ వారియర్ చొప్పున 17 మందిని నియమించడం జరిగిందని తెలిపారు. సైబర్ వారియర్స్‌గా శిక్షణ పొందిన పోలీస్ స్టేషన్‌లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా ఒక ఫోన్ నెంబర్ ఉంటుందన్నారు. సైబర్ నేరాల బారిన పడిన ప్రజలు వెంటనే 1930కి కాల్ చేయడం గానీ లేదా ఎన్‌సీఆర్పీ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. బాధితుల ఫిర్యాదులను నమోదు చేసుకుంటేనే గుర్తించడం సులువవుతుందని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడి ఫిర్యాదు చేసిన బాధితుడికి సంబంధిత పోలీస్ స్టేషన్‌లో నియమింపబడిన సైబర్ వారియర్ ద్వారా తమ అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. జిల్లా ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, జిల్లా సైబర్ క్రైమ్స్ డీఎస్పీ రమేష్, ఎస్పీ సీఐ రాణా ప్రతాప్, సైబర్ సెల్ సభ్యుడు శ్రీనివాస్, సైబర్ వారియర్స్ పాల్గొన్నారు.

ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దస్నాపూర్ కాలనీలో తాగునీరు అందించే వాటర్ ట్యాంక్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేయాలని, వాటి పరిసర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సూచించారు. అశుభ్రంగా ఉంటే వ్యాధులు ప్రభలే అవకాశం ఉంటుందని అన్నారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భూజంగరావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శైలేందర్, గ్రిడ్ ఏఈ శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ కల్యాణలక్ష్మి చెక్కులు అందించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 2023-24 సంవత్సరానికి దరఖాస్తు చేసుకున్న వారికి పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి పథకం లబ్ధిదారులకు వెంటనే చెక్కులను చెల్లించాలని డివైఎఫ్ఐ, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. డిఆర్ఓ లోకేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణలక్ష్మి ద్వారా అందే మొత్తాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనితో పేద లబ్ధిదారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ స్థాయిలో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. స్పందించిన డిఆర్ఓ త్వరలోనే కల్యాణ లక్ష్మి డబ్బులు లబ్ధిదారులకు అందజేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పాల్గొన్నారు.

నవోదయలో మెరిసిన విద్యార్థులు



నవోదయ ఆరవ తరగతి ప్రవేశ పరీక్షలో జిల్లా కేంద్రం నుండి విద్యార్థులు విజయం సాధించారు. ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలోని వేరువేరు పాఠశాలలకు చెందిన వీరు ముగ్గురు కూడా ఒకే ప్రయివేట్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకున్నారు. ముగ్గురు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

- జిల్లా కేంద్రం నుండి ముగ్గురి ఎంపిక

ప్రణాళిక ప్రకారం చదివిన అద్వైత్



వేముల వెంకటేష్, రత్నాంజలిల కుమారుడు వేముల అద్వైత్ స్థానిక బజార్‌వాడిలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో చదువుతూ నవోదయకు ఎంపికయ్యాడు. ప్రణాళిక ప్రకారం చదివాడు. తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో కలిసి వచ్చింది. ప్రయివేట్ కోచింగ్ కూడా దానికి తోడైందని తెలిపారు. తండ్రి వెంకటేష్ మాట్లాడుతూ సంవత్సరం నుండి నవోదయ లక్ష్యంగా కుమారుడిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

నవోదయలో సీటు సంపాదించిన రిషిక



స్థానిక హోలీ ట్రినిటీలో చదువుతున్న జాదవ్ రిషిక ఉపాధ్యాయునిగా పని చేస్తున్న ప్రేమ్ సింగ్, అనితల కూతురు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవోదయ లక్ష్యంగా తన కూతురు చదువుతుందన్నారు. సరైన సమయంలో అవసరమైన పుస్తకాలతో తనను సిద్ధం చేసినట్లు తెలిపారు. చివరికి నవోదయ సీటు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

అనుకున్న లక్ష్యం సాధించిన ఆదిత్యవర్ధన్



జిల్లా కేంద్రంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వర్, లతల కుమారుడు ఆదిత్యవర్ధన్ స్థానిక సెయింట్ మేరీ పాఠశాలలో చదువుతూ నవోదయ సీటు సంపాదించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాన్ని సాధించడం సంతోషంగా ఉందన్నారు. తండ్రి నాగేశ్వర్ మాట్లాడుతూ కౌటాల నుండి జిల్లా కేంద్రానికి బదిలీ కావడం సరైన కోచింగ్ సెంటర్ దొరకడంతో అనుకున్న లక్ష్యం తన కుమారుడు సాధించడాని తెలిపారు. కుమారునికి నవోదయ రావడం సంతోషంగా ఉందన్నారు.

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు పని ప్రదేశాల్లో వేసవి తీవ్రత దృష్ట్యా అవసరమైన వసతులు కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని బూరుగుడ సమీపంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పథకంలో చేస్తున్న వివిధ పనులకు సరైన సమయంలో డబ్బులు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో తలకు రుమాలు ధరించాలని సాధ్యమైనంత మట్టుకు ఎండ తీవ్రత పెరగక ముందు పని పూర్తి చేసుకుని ఇళ్లలోకి చేరుకునే విధంగా చూడాలన్నారు. వంద రోజులు పూర్తయిన మహిళలకు ఉట్నూరులోని కొమరం భీం కాంప్లెక్స్‌లో కుట్టు మిషన్, బ్యూటీ పార్లర్ శిక్షణ అందజేయడం జరుగుతుందని, ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సురేందర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

రేపటి జగ్జీవన్ జయంతి వేడుకలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 5న జిల్లా కేంద్రంలోని జగ్జీవన్ రావు చౌక్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే జగ్జీవన్ రావు జయంతి వేడుకలు విజయవంతం చేయాలని ఆ సంఘం ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడు

- ఆరె సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జయరాం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేటి తరానికి ఛత్రపతి శివాజీ ఆదర్శప్రాయుడని ఆరే సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జయరాం అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆరే సంక్షేమ సంఘ భవనంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 344వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ నేటి తరానికి ఆదర్శ ప్రాయుడన్నారు. యుద్ధనీతి రాజనీతి ఎంతో తెలిసిన వాడన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డివిజన్ గౌరవ అధ్యక్షుడు చౌదరి గోపాల్, అధ్యక్షుడు బొర్కుటే తిరుపతి, కార్యదర్శి బోటుపెల్లి ప్రశాంత్, బీసీ సంఘం రైతు అధ్యక్షులు వైరగడే మారుతి, అసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకార్ సంతోష్ శంకర్, ఉపాధ్యక్షుడు పిప్రే సాయి, ప్రధాన కార్యదర్శి నాగపూర్ మనోహర్, సంఘ నాయకులు లోఖండే నాగన్న నగపూరి మహేష్, శేఖర్, అంబాదాస్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
గురువారం | ఏప్రిల్ 04, 2024 | www.navatelangana.com

అనుమతి లేని వెంచర్ హద్దురాళ్లను తొలగించిన అధికారులు

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్ మున్సిపాలిటీ పరిధి సంగమల్లే పల్లెలోని అనుమతి లేని అక్రమ వెంచర్‌ను డీటీఎఫ్(డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్) టీం ఆధ్వర్యంలో బుధవారం హద్దు రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ మాట్లాడుతూ అనుమతి లేకుండా ఎటువంటి అక్రమ నిర్మాణం చేపట్టరాదని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అక్రమ నిర్మాణం చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మాంతయ్య పాల్గొన్నారు.

కుశనపెల్లి దీప్తికి నంది అవార్డు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



పట్టణానికి చెందిన కుశనపెల్లి రాజయ్య, మల్లమ్మల పెద్దకుమార్తె దీప్తికి విద్య సేవ రంగంలో గాను నంది అవార్డు దక్కింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సినీ కథ రచయిత, దర్శకులు జెకే భారవి, సినీ రచయిత మల్లిక్, సినిమాటోగ్రాఫర్ అశోక్ కుమార్, సెన్సార్ బోర్డు మెంబర్ దరువు ఎల్లన్న, పీసీసీ అధికార ప్రతినిధి మరికంటి భావనిరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇప్పుడున్న పోటీ తత్వంలో సక్సెస్ వీసాస్ ఎడ్యూకేషన్ కన్సల్టెంట్స్ ఏర్పాటు చేసి ఎంతో మందిని విద్య కోసం వివిధ దేశాలకు పంపించి స్థిరపర్చినందుకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రయివేట్, కార్పొరేట్ విద్య సంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదునూరి అభినవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలలో ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తూ చదువుని అమ్ముకుంటూ పేదవారికి చదువును దూరం అయ్యేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఈ ఫీజులను నియంత్రించడంలో గత రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వ అధికార యంత్రాంగం పాటించుకోకుండా కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ము కాస్తూ విద్యను నీరుగారుస్తున్న పరిస్థితి రాష్ట్రం, జిల్లాలలో నెలకొందన్నారు. ఇకనైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఫీజులు నియంత్రించేలా చర్యలు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టి ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. అదే విదంగా ప్రస్తుత కాలంలో ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు పుట్ట గొడుగుల్ల పుట్టుకొస్తున్నాయని, ఉన్నత అధికారులు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. 5 సంవత్సరాల నుంచి ఫెలోషిప్స్ రావడం లేదని, వాటిని వెంటనే విడుదల చేయాలన్నారు. పలు ప్రయివేట్ కళాశాల మేనేజ్‌మెంట్ స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో విద్యార్థులను ఇబ్బంది పెడుతూ వారి నుండి డొనేషన్, ఫండ్స్ పేరిట డబ్బులు వసలు చేస్తున్నారని ఆరోపించారు. కళాశాల కరెస్పాండెంట్, ప్రిన్సిపల్ వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

చలివేంద్రాన్ని ప్రారంభించిన మేముసైతం కమిటీ



నవతెలంగాణ-మందమర్రి

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి మేము సైతం కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2015 నుంచి ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మేముసైతం స్వచ్ఛంద సేవా సంస్థ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చిన్నారి చుక్క సహస్ర జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సహకారంతో పెరుగు అన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేముసైతం సంస్థ అధ్యక్షుడు బుబత్తుల శ్రీనివాస్, కమిటీ సభ్యులు ఎర్ర రాజు, జైన శ్రీదర్, ఉప్పలంచి చంద్రకాంత్, బోరిగం వెంకటేష్, ఈర్లపాటి సోమయ్య, కొండ శ్రీనివాస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-జన్నారం

ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని పొనకల్ సింగిల్ విండో చైర్మన్ బాల్క రాజమౌళి బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరగా ఆయకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులంతా సీనియర్ జూనియర్స్ అనుకోకుండా కలిసికట్టుగా ఐకమత్యంగా పని చేస్తూ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. మాజీ సింగిల్ విండో చైర్మన్ వాల్త రాజమౌళి మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించడానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్‌పై అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

రక్షణ, ఆరోగ్యం సేఫ్టీ సిస్టం అంశాలపై బుధవారం ఇల్లందు క్లబ్ బంగ్లా ప్రాంతంలో అవగాహన సదస్సు నిర్వహించారు. జీఎం సేఫ్టీ కార్పొరేట్ గురువయ్య, ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ అధ్యక్షతన జరిగిన సదస్సులో అవగాహన కల్పించారు. రక్షణ, ఆరోగ్యం పై శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, బెల్లంపల్లి జీఎం రవి ప్రసాద్, ఏజీఎం సేఫ్టీ బెల్లంపల్లి రీజియన్ రఘు కుమార్‌లతో చర్చించి ఏరియాలోని గనులకు వెళ్లి ఉద్యోగులకు అవగాహన కల్పిస్తూ చెక్ లిస్ట్ ప్రకారం ఆడిట్ చేయాలని అధికారులకు సూచించారు. రక్షణ ఆరోగ్యంపై ఎస్అండ్ పీసీ ఎస్ఓఎం విజయ్ కుమార్, సేఫ్టీ రేటింగ్ గురించి డిజీఎం (కార్పొరేట్) శేషుబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం, ఫైనాన్స్ అధికారులు, సేఫ్టీ అధికారులు, ఈ అండ్ ఎం అధికారులు, పర్సనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రజల ఇక్కట్లు

నవతెలంగాణ-వేమనపల్లి



మండలంలోని ముల్కలపేట గ్రామం ఎస్టీ కాలనీలో ప్రజలు తాగు నీటికి ఇక్కట్లు పడుతున్నారు. ఒక పక్క తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ కింద కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ నల్లా ద్వారా నీరు అందిస్తున్నదని గొప్పలు తప్ప నీరు అందించలేదు. మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు ఇవ్వకపోగా ఇచ్చిన కనెక్షన్లు లీకేజీలతో నీరు వృథా పోతుంది. దానికి తోడు ఎస్టీ వాడలో చేతిపంపు చెడిపోవడంతో 30 కుటుంబాలు తాగు నీటి సౌకర్యం లేక పదిహేను రోజులుగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అసలే వేసవి కాలం ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. పెరుగుతున్న ఎండలతో నీటి అవసరాలు కూడా పెరిగాయి. దగ్గరిలో ఉన్న వాటర్ ట్యాంక్‌కు మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో వాటర్ ట్యాంక్ వృథాగా ఉంది. గడిచిన నెల నుంచి నీటి కోసం ఇబ్బందులు పడుతున్న ఎస్టీ కాలనీ ప్రజలు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకు వెళ్తే ఎలాంటి పరిష్కారం లభించలేదని ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్లు లేకపోవడం కూడా ఓ కారణమే. గ్రామానికి పూర్తిస్థాయిలో నీరందించాలంటే మిషన్ భగీరథ పైప్‌లైన్లు లీకేజీ లేకుండా చేసి, వాటర్ ట్యాంక్‌కి కనెక్షన్ ఇవ్వాలని, అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజల కోరుతున్నారు.

జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణలో కాంట్రాక్టు కార్మికులకు జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ అన్నారు. బుధవారం సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సీహెచ్‌పీలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలను చెల్లించడం లేదన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను పరిగణలోకి తీసుకొని వేతనాలను పెంచాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనాలను 2012 సంవత్సరం నుండి చెల్లించకపోవడంతో పది సంవత్సరాల నుండి కార్మికులకు వేతనాలు పెరగడం లేదన్నారు. జీతాల పెరుగుదలకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ చేసిన పోరాట ఫలితంగా 2021 జూన్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 22ను తీసుకువచ్చిందని తెలిపారు. కానీ దానిని గెజిట్ చేయకుండా కార్మికులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 22కు బదులు జీఓ 94 తీసుకువచ్చిందని తెలిపారు. వెంటనే ఆ జీఓను రద్దుచేసి జీఓ 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులు అందరికీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేసవికాలం దృష్ట్యా ఎండలు తీవ్రతరమైనందున కార్మికులకు వడదెబ్బ తగిలే ప్రమాదం ఉన్నందని, సర్ఫేస్‌లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బూర వీరేశం, శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, ఖాత రాజు, ప్రభాకర్, సహాయ కార్యదర్శి చారి, కోశాధికారి పల్లె సత్యనారాయణ, కోమల పాల్గొన్నారు.

రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-జన్నారం



జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాలను జాతీయ మాల మహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బందెల బెంజు మెన్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ దేవేందర్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గజ్జెల్లి లక్ష్మణ్, నియోజకవర్గ అధ్యక్షుడు గరిసే రామస్వామి, జై భీమ్ సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షులు ఎర్రోళ్ల నరేష్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుచుకుంటే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బెదిరింపులకు పాల్పడుతుందని తెలిపారు. రానున్న ఎన్నికలలో బీజేపీకి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీకి కాకుండా ఇతర పార్టీలకు ఓటు వేసి రాజ్యాంగాన్ని కాపాడాలని ప్రజలకు తెలియ చెప్పడానికి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జాతీయ అధ్యక్షులు డాక్టర్ అద్దంకి దయాకర్ సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ రక్షణ యాత్ర ఏప్రిల్ 2న అలంపూర్ నుంచి ప్రారంభించి 8న హైదరాబాద్‌లో బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. 5న యాత్ర మంచిర్యాల జిల్లాకు చేరుకుంటుందని తెలిపారు. దళిత, గిరిజనులు, మైనారిటీలు, బహుజన ప్రజలు, మేధావులు, అంబేద్కర్ వాదులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు గజ్జెల్లి లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బందెల బెంజుమెన్, జిల్లా ఉపాధ్యక్షుడు బండ దేవేందర్, మంచిర్యాల నియోజకవర్గ అధ్యక్షులు గరిసే రామస్వామి, హజీపూర్ మండల అధ్యక్షులు దామెర రాజయ్య, మండల అధ్యక్షుడు పాత బాలరాజు, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, కుంబాల రవి, సీనియర్ నాయకులు మేడ రాజలింగు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాంటాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం కాంట్రాక్ట్ కార్మికులతో డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా ఏప్రిల్ 5 నుండి సింగరేణి అన్ని రంగాల కాంట్రాక్టు కార్మికులకు పని వేళలు మార్చాలని డిమాండ్ చేశారు. మార్చి నెలలోనే 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటి ఎండ తీవ్రత ఉందన్నారు. కాంట్రాక్టు కార్మికులు పనుల వద్ద వేసవి తాపానికి తాళలేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనివల్ల కార్మికులు విధులకు హాజరు కావడం కూడా ఇబ్బందులు అవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని సింగరేణి వ్యాప్తంగా ఇప్పటికే అన్ని విభాగాల అధికారులకు జీఎంలకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. ఉచితంగా కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మంచి నీటి సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే ఈనెల 5 నుండి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వరకు మాత్రమే పనులు నిర్వహించే విధంగా కింది అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని జీఎంలకు కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.అప్పారావు, రాంబాబు, సుధాకర్, శంకర్, రాము, ఎల్లయ్య, సమ్మయ్య, రాజేష్, సత్యక్క, కవిత, శిరీష, స్వప్న, మల్లేశ్వరి, శారద పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వలను సహించేది లేదు

నవతెలంగాణ-జైపూర్



ఇసుక అక్రమ నిల్వలను ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని తహసీల్దార్ వనజా రెడ్డి హెచ్చరించారు. రామారావు పేట్ శివారులో ఇసుక అక్రమంగా నిలువ చేసినట్లు అందిన సమాచారం మేరకు బుధవారం సంఘటన స్థలాన్ని సందర్శించారు. సుమారుగా 25 ట్రాక్టర్ ట్రిప్పుల అక్రమ ఇసుక నిల్వలున్నట్లు గుర్తించి విచారణ చేపట్టినట్టు ఆమె తెలిపారు. అక్రమ ఇసుక నిల్వల పట్ల పలుమార్లు హెచ్చరించడం జరిగిందన్నారు. ఇసుక అక్రమ నిల్వ, రవాణాపై నిఘా ఏర్పాటు చేశామని, నిబంధనల విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-మందమర్రి

పంచాయతీలలో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ గణపతి అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీడీఓ ఎస్ రాజేశ్వర్, సూపరింటెండెంట్ ఎస్ బాలకిషన్ రావు, కార్యాలయ సిబ్బంది శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలిసుకున్నారు. అనంతరం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో సమస్య లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ తగలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకములో లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ నూతన కమిటీ నియామకం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

భారతీయ జనతా పార్టీ పట్టణ నూతన కమిటీతో పాటు వివిధ మోర్చాల కమిటీని బుధవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షులు వేముల అశోక్ ఆధ్వర్యంలో నియమించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా కట్ట ఈశ్వర చారి, మాసు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా వైద్య శ్రీనివాస్, ముద్దసాని శ్రీనివాస్, వీరమల్ల రాజయ్య, కార్యదర్శులుగా జీడి ప్రభాకర్, పాకాల ప్రభాకర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులుగా కున్సోత్ సంతోష్ రామ్, పట్టణ ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా బంగారి ప్రసాద్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా పాకాల శ్రీలత, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా గజ్జల వెంకన్నలను నియామించారు. అనంతరం నియామకమైన కమిటీ నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతంతో పాటు రానున్న ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఫిలిం బోర్డ్ సభ్యులు ఆర్మ్యాల్ల పోషం, సీనియర్ నాయకులు బంగారు వేణుగోపాల్, ఠాగూర్ దన్సింగ్, దండు రాజేందర్, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు వేముల సరస్వతి పాల్గొన్నారు.

వంద రోజుల పని దినాలు కల్పించాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి వందరోజుల పని దినాలు కల్పించాలని భీమారం ఎంపీడీఓ రాధా రాథోడ్ సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ రోజువారి కూలీ రూ.272 నుండి రూ.300 పెంచిన విషయాన్ని ఆమె తెలియజేశారు. ఉపాధి హామీ పనుల నిర్వహణ పట్ల క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి నిర్ణీత కొలతలతో పనులు జరుగుతున్న తీరు పర్యవేక్షించాలని ఆదేశించారు. అదే విధంగా ఉపాధి హామీ పనుల నిర్వహణ క్రమంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా జాగ్రత్త పడాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల వారీగా తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు సందర్భాన్ని బట్టి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని తెలుపుతూ క్షేత్రస్థాయి సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిది గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టెక్నీషియన్లు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-జన్నారం

మండలం రోటిగూడ గ్రామంలో మూడు రోజుల క్రితం గోనే రామక్క కుమారుడు గోనె నరసయ్య అనారోగ్యంతో చనిపోయారు. గోనె రామక్కది చాలా నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న రోటిగుడ సామాజిక సంక్షేమ కమిటీ గోనె రామక్క కుటుంబానికి బుధవారం రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకుడు పాలాజీ శ్రీనివాస్ మాట్లాడుతూ గత సంవత్సరం మహాశివరాత్రి రోజున ఏర్పాటు చేసుకున్న కమిటీ దాతల విరాళాలతో నిరుపేదలను ఆదుకుంటుందన్నారు. పుట్టిన, పెళ్లి రోజులు, శుభకార్యాలు, పండగలకు, విరాళాలు సేకరించి అర్హులైన నిరుపేదలను గుర్తించి సాయం చేస్తున్నామని తెలిపారు. విరాళాలు అందించిన దాతలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజుల సత్తయ్య, ఉప్పు శ్రీనివాస్, గోనె గట్టయ్య, శివనూరి శ్రీనివాస్, పాదం రాజిరెడ్డి, ఉప్పు నర్సింగ్, పులిశెట్టి లవన్ కుమార్, నీరటి మల్లేష్, గోనె గోపాల్, ములంగిరి చంద్రయ్య, గోనె రమేష్ పాల్గొన్నారు.

ఇటికల్ పహాడ్‌లో గుర్తు తెలియని మృతదేహం

నవతెలంగాణ-సిర్పూర్(టి)



మండలంలోని ఇటికల్‌పహాడ్‌లో గుర్తుతెలియని శవం లభ్యమైంది. ఎస్సై డికొండా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఇటికలపహాడ్ గ్రామ శివారులో దారి తప్పి వచ్చి ఎటు వెళ్లాలో తెలియక దిక్కు తోచని నిస్సహాయ స్థితిలో అక్కడి పడిపోయాడు. నీరు, ఆహారం దొరకక ఎండ వేడికి ఆకలితో 2, 3 రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని ప్రాథమిక అంచనకు వచ్చారు. మృతుని ఆచూకీ తెలియనందున అతని ఆచూకీ గురుంచి తెలిసిన వారు సెల్ : 8712670544,8712670512లలో సంప్రదించాలని సూచించారు.

తనిఖీలో రూ.15 లక్షలు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని టోల్ ప్లాజా చెక్ పోస్ట్ వద్ద బుధవారం వాహనాల తనిఖీల్లో సరైన ఆధారాలు లేకుండా తరలిస్తున్న వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.15లక్షల 69120 పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 11మంది కారులో మంచిర్యాలకు వెళ్తుండగా వారి వద్ద నుండి రూ. 15.69 పట్టుకున్నట్లు వివరించారు. ఈ తనిఖీలో ఎస్సై గంగన్న రూ.4,88,000 నగదును పట్టుకోగా, వాంకిడి సీఐ రూ.10,81,120 నగదును పట్టుకున్నట్లు తెలిపారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వాంకిడి ఏఎస్సై పోషెట్టి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వడ్‌గావ్‌లో పోలీసుల కవాతు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎంపి ఎన్నికల దృష్ట్యా మండలంలోని మారుమూల గ్రామమైన వడ్‌గావ్‌లో కేంద్ర పారా మిలిటరీ బలగాలతో బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా నిర్భయంగా ఓటు వేయాలని సూచించారు. ఈ ఫ్లాగ్ మార్చ్‌లో స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ పాల్గొన్నారు.

క్రాంతివీర్ రాంజీగోండ్ 164వ వర్ధంతి నిర్వహిస్తాం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రాంతివీర్ రాంజీగోండ్ 164వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు హీరాసుక జాగృతి సమితి జిల్లా అధ్యక్షులు సిడాం రాంకిషన్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి మాట్లాడారు. ఈ నెల 9న ఆర్టీసీ బస్టాండ్ వద్ద రాంజీగోండ్ విగ్రహం వద్ద నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి ఆదివాసీ తెగలు, అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోరాట యోధుడైన రాంజీగోండ్ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఆనాడు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసి అసువులు బాశారన్నారు. ఊడల మర్రిపై ఉరితీయబడ్డారన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. రాంజీగోండ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు, మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అన్నివర్గాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని టోల్ ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన జాడి శాంతబాయి(65) వాంకిడిలో జరిగే శుభకార్యంలో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఆసిఫాబాద్ నుంచి అతివేగంగా వచ్చిన ఐచర్ వ్యాన్ టీవీఎస్ ఎక్సెల్, దాని ముందున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఆసిఫాబాద్ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శాంతబాయి మృతి చెందింది. మరో ఇద్దరు బుద్దాజి, సంగీతాలను మంచిర్యాల ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు. మృతురాలి కొడుకు జాడి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాగర్ వెల్లడించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని స్థానిక మసీదులో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ మసూద్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వేడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైనొద్దీన్, జహీర్‌లు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు చేయగా ఎమ్మెల్యే వారితో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అతీఖ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని వార్డు నెంబర్ 35 శాంతినగర్ బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు ముహమ్మద్ అతీఖ్ ఉర్ రహెమాన్ బుధవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఆర్టీసీ ద్వారా భద్రాద్రి తలంబ్రాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

భద్రాచలం రాముని కళ్యాణం మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్టీసీ ద్వారా భక్తులకు తలంబ్రాలు అందజేయనున్నట్లు డిపో మేనేజర్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వారి తలంబ్రాలు అవసరమైన భక్తులు సెల్ నంబర్ 9154298534కు ఫోన్ చేసి రూ.151 చెల్లించి, లేదా ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కౌంటర్ నందు చెల్లించి పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిక్షణలో క్రమశిక్షణ తప్పనిసరి

- జిల్లా శిక్షణ కేంద్రంలో 255 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ
- శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవ్వాలి
- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు శిక్షణ సమయంలో క్రమశిక్షణతో ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న ఆరు జిల్లాల నుంచి గత నెల ఆదిలాబాద్ జిల్లా శిక్షణ కేంద్రానికి విచ్చేసిన 255 మంది శిక్షణ కానిస్టేబుళ్ల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని, శిక్షణ స్వీకరిస్తున్న స్టైఫండరి కానిస్టేబుళ్లను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని శిక్షణ కేంద్రాల్లో ఒకే రకమైన శిక్షణ అందిస్తుందని తెలంగాణ ప్రభుత్వం ద్వారా అత్యంత ఉన్నతమైన సౌకర్యాలను కల్పిస్తూ శిక్షణను అందించడం జరుగుతుందని తెలిపారు. 9 నెలల పాటు జరిగే ఈ శిక్షణలో ఇండోర్ ఔట్ డోర్ విభాగాలను శిక్షణను అందిస్తారని తెలిపారు. శిక్షణలో భాగంగా ఫిజికల్ ట్రైనింగ్, స్క్వాడ్ డ్రిల్, ఆమ్స్ డ్రిల్, లాటి డ్రిల్, వెపన్ ట్రైనింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, ఫైరింగ్ ప్రాక్టీస్, యోగ, అదేవిధంగా సీఆర్ పీసీ, ఐపీసీ, ఇన్వెస్టిగేషన్, నేరస్తులు ఉపయోగిస్తున్న నూతన పద్ధతులను నేర్పించడం జరుగుతుందని తెలియజేశారు. సమాజంలో పోలీసులకు ఉన్నత స్థానం కలిగి ఉందని దాన్ని ఎల్లవేళలా కాపాడుతూ ఉండాలని, ఉద్యోగం నిర్వహించేటప్పుడు ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ తప్పనిసరి అని సూచించారు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న కానిస్టేబుళ్లకు రూ.13వేల 500 స్టైఫండ్‌ను అందిస్తున్నట్లు తెలియజేశారు. పోలీసు ఉద్యోగం అనేది ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగమని తెలియజేశారు.

ఏకాగ్రతతో ఉంటూ ప్రతిఒక్క అంశాన్ని తెలుసుకోవాలి...

శిక్షణ సమయంలో ఏకాగ్రతతో ఉంటూ ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం సమాజంలో నేరాలను తగ్గుముఖం చేయడమే ప్రధాన కర్తవ్యంగా విధుల నిర్వర్తించాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు, ఆర్థిక నేరగాళ్లు, సంఘవిద్రోహశక్తులు, వివిధ రకాలైన నేరగాళ్లతో ఉద్యోగం నిర్వహించాల్సి వస్తుందని, దీనికి దీటుగా శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారవ్వాలని సూచించారు. ఉద్యోగంలో ప్రతి ఒక్క సిబ్బంది నిత్య విద్యార్థిగా ఉంటూ, నూతన నేరాలను కనుగొంటూ, వాటిని చేదించే దిశగా శిక్షణను అందించనున్నట్లు తెలియజేశారు. జిల్లా ఎస్పీ స్వయంగా తన శిక్షణ సమయంలో తెలుసుకున్న విషయాలను శిక్షణ కానిస్టేబుళ్లకు తెలియజేశారు. ఎటువంటి అత్యవసర సమయంలోనైనా పోలీసులు ముందుండి సమాజానికి దారి చూపించే విధంగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం శిక్షణ కేంద్రంలో తిరిగి కానిస్టేబుళ్లకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సి.సమైజాన్‌రావు, డీఎస్పీ బి.ప్రకాష్, సీఐ ఎస్ఎస్ ప్రసాద్, ఆర్ఐ డి.కార్తీక్, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం



పాల్గొన్న పోలీసు అధికారులు



హాజరైన కానిస్టేబుళ్లు

గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గడువులోగా (సీఎంఆర్) కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాలను పూర్తి చేయాలని నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సీఎంఆర్ లక్ష్యాలు తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ 2023-24 సంవత్సరం లక్ష్యాలను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత మిల్లర్లను ఆదేశించారు. నిరంతరం మిల్లింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మిల్లుల వారీగా ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిలర్ల వారిగా లక్ష్యం, పూర్తి చేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, డీఎస్ఓ నంధిత, సివిల్ సప్లాయి డీఎం శ్రీకళ, తహసీల్దార్లు, అధికారులు, మిల్లర్లు పాల్గొన్నారు.

నా రోల్ మోడల్ మంత్రి శ్రీధర్ బాబు

- కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి వంశీకష్ణ



నవతెలంగాణ-జైపూర్

మంత్రి శ్రీధర్ బాబు తన రోల్ మోడలని కాంగ్రెస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. హైదరాబాద్‌లోని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధి ఎమ్మెల్యేలతో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి కాకా వెంకటస్వామి వారసునిగా పెద్దపెల్లి పార్లమెంట్ పరిధి నుండి పోటీ చేస్తున్నట్టు తెలిపారు. కాకా వెంకటస్వామితో పాటు 15 సంవత్సరాలుగా చెన్నూరు, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు వివేక్ వెంకటస్వామి, గడ్డం వినోద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అందిస్తున్న సేవలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం పరిధి ప్రజల స్పందన తమకు అనుకూలంగా ఉందని పార్లమెంట్ సభ్యునిగా నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాగా సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థి వంశీకృష్ణ గెలుపుకు నియోజకవర్గం పరిధి శాసనసభ్యులు కృషి చేస్తారని పేర్కొన్నారు.

ఓటింగ్ మిషన్ మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ మొదటి విడత ర్యాండమైజేషన్ పూర్తైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. బుధవారం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదాంను సందర్శించారు. జిల్లాలోని రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల అధికారుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల మొదటి విడత ర్యాండమైజేషన్, ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పూర్తి ఆన్‌లైన్ విధానం ద్వారా కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల వారీగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) గోడౌన్ నుండి రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో మొదటి రాండమైజేషన్ పూర్తి చేసి ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లో భద్ర పరచడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీఓ, రాజకీయ పార్టీ ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.





అప్పుల బాధతో ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-లక్సెట్టిపేట



అప్పుల బాధతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. ఎస్సై చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్ఆర్ గార్డెన్ ముందు గల ఎంకే బ్రిక్స్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇర్ఫాన్ ఖాన్(25) మూడు నెలల క్రితం ఇక్కడ పని చేసేందుకు మిత్రులతో కలిసి వచ్చాడు. ఇక్కడ పని చేయడం తనకు ఇష్టం లేదు. అదే విధంగా మద్యం, జల్సాలకు బానిసై అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక మనస్థాపనికి గురై ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బావమరిది వశిక్ ఖాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాంసి



హస్నాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల విలాస్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. బుధవారం కాంగ్రెస్ అదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పమార్శించారు. కుటుంబానికి తన వంతుగా రూ. పదివేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి కుటుంబ పెద్దదిక్కు అకాల మరణం ఆ కుటుంబానికి తీరనిలోటు అన్నారు. భవిషత్తులో కుటుంబానికి తనవంతుగా సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రెడ్డి భుజారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సింగ్, సుధాకర్ గౌడ్, ఖయ్యూం, శంకర్ ఉన్నారు